వంట బ్రాహ్మడికి తిండి అంటే ముఖంమొత్తినట్టు సుబ్బారావుకి బంగారం అంటే ముఖం మొత్తింది. వజ్రాలంటే ముఖం మొత్తింది. గత పదేళ్ళనుంచి సేఠ్‌జీ షాపులో పనిచేస్తున్న సుబ్బారావు పొద్దుట తొమ్మిదిన్నరనుంచి సాయంత్రం ఆరయ్యేదాకా వాటినే తీస్తూండడం, తుడిచి పెడ్తూ వుండడంతో వాటి ధరలూ వివరాలే తప్పించి, వాటి అందచందాలపై అంచనా కట్టే అలవాటు పోయింది.




# ఖరీదు

కె. రామలక్ష్మి

వచ్చిన బేరం అల్లా సెటిల్ చేసేస్తే సేఠ్ ముఖం ట్యూబులైటులా వెలిగిపోతుంది. బేరం పోతే అతగాడి ముఖం బుడ్డి దీపంలాగా తయారవుతుంది! "నిజానికి నా ముఖం అలా తయారవ్వాలి గాని సేఠ్ కేం బెంగ?" అనుకోవడం కూడా అలవాటు అయిపోయింది సుబ్బారావుకి.

సేఠ్ చాలా సౌమ్యుడు. దైవభక్తి. పాపభీతీ వున్నవాడు. సేల్సుమీద కమిషన్ యిస్తాడు. షాపులో పనిచేసేవాళ్ళ ఉత్సాహం సన్నగిల్లిపోకుండా. అందుకే సుబ్బారావుకి ఉద్యోగమే బాగుందనిపించి పదేళ్ళుగా సాగించేస్తున్నాడు. జీవితాన్ని లాగించేస్తున్నాడు. 'సుందరికూడా పాపం అమాయకురాలు. నేను ఎంతో కష్టపడి కుటుంబం పోషిస్తున్నానని ఆనందించేస్తూంటుంది' అనుకొనే సుబ్బారావు ఎప్పుడేనా, 'ఈ నగ కొనిపెడితే సుందరి ముఖం ఎలా వుంటుంది?' అన్న ఆలోచన ఎప్పుడూ రానివ్వ




లేదు! రానిచ్చి ఏం ప్రయోజనం? ఎలాగా కొనలేదు.

సంసారం భారం కాలేదు కనుక, సగటు మధ్యతరగతి మనిషిలాగా— 'అంతా బాగానే వుంది ప్రస్తుతానికి!' అని సంతోషంగానే వుంటున్నాడు ...

డైమెండు నగల అమ్మకం ఒకొక్కప్పుడు సుబ్బారావుని ఆశ్చర్యంలో ముంచెత్తేస్తూవుంటుంది. 'ప్రపంచంలో డబ్బెక్కడుంటారు? కరువే వుంటే— వేరుసెనక్కాయలు కొన్నట్టు యీ ఉంగరాలూ, కమ్మలూ, బిళ్ళలూ కొనగల్గుతారా?' అని ఆశ్చర్యపడిపోతూ వుంటాడు.

కనీ కనిపించనంత రాయి ఉంగరం 2 వేలు దాటిపోయింది. కమ్మలా? పదివేలేనా లేకుంటే కంటికి ఆనేవి రానే రావు! 'డబ్బు విలువ పుచ్చువంకాయల బేరంలా కనిపించే నాకు-యీ రవ్వల దగ్గిర అర్థం కాదేం?' అని తల బద్దలు కొట్టుకుంటూ వుంటాడు కూడా.

కొందరు ఏవో తలనొప్పి బిళ్ళలు కొనుక్కున్నట్టు లేదా హోమియోపతి మాత్రలు కొనుక్కున్నట్టు ఉటి రవ్వలు పొట్లం కట్టి పట్టుకు చక్కాపోతారు. 'ఏభయీ, అరవై వేలు పోసి— ఇంతేనా అని అనుకోరు కాబోలు' అని వింతపడుతూ ఉంటాడే గాని అలా కొనుక్కున్న వాళ్ళంటే సుబ్బారావుకి చాలా గౌరవం.




వారి బేరం వల్ల మంచి కమీషన్ అందుతుంది. అదే తనకి పది వేలు అని ఆనందించేస్తూంటాడు.

ఆ రోజు శుక్రవారం. ఉదయం అంతా బేరాలే లేవు. కొందరు శుక్రవారం డబ్బులివ్వరు - సెంటిమెంటు! ఎప్పటికప్పుడు షోకేసులో అన్నీ వున్నాయాలేవా అని వెయ్యికళ్ళతో చూసుకుంటూ లాక్ చేసి వుంచుతాడు. ఎందుకేనా మంచిదని. "వచ్చేవాళ్ళంతా పెద్ద మనుషులని నమ్మకు" "నీ జాగ్రత్తలో నువ్వుండు" అన్నవి సేఠ్ గారి- నినాదాలు. అందుకే- సుబ్బారావు చెవుల గోడలకి అవి అంటుకుపోయి ప్రతిధ్వనిస్తూ వుంటాయి.

మధ్యాహ్నం మూడు గంటలకి లంచ్ తర్వాత కొట్టు తెరవగానే - తన కిందవున్న బీరువాలనీ ఓ కంట పరీక్షగా చూసేసి కూర్చున్నాడు. షాపులో ఎవరూ లేకపోయినా- ఏ పుస్తకమో, పేపరో తెరవడం సహించలేడు సేఠ్‌జీ. అందుకే ఆ ఏసి రూషోము- కస్టమర్సు లేనప్పుడు జనరల్ ఆస్పత్రిలో శవాల గదిలాగా నిశ్శబ్దంగా వుంటుంది. ఏసి మిషను రొద అప్పుడప్పుడు వినిపిస్తుండడం మినహా— యిక ఏ ఇతరమైన సంచలనం వుండదు.

గాజు తలుపులకేసి ఆత్రంగా చూస్తూకూర్చునివున్న సుబ్బారావు ముఖం ఒక్కసారిగా వెల్గింది. తలుపు తోసుకుని లోపలికి వస్తూన్న జంటని చూడగానే 'తప్పదు. ముసలి మొగుడు పడుచు పెళ్ళాం-గిరాకీ తప్పదు' అనుకొంటూఉత్సాహంగా తప్పట్లు కొట్టలేదుగానీ కూర్చున్న చోటనే లేచి నిలబడ్డాడు. ముసలి కృష్ణుడిని టీనేజి దాటని గోపిక వరించి వల్లో వేసుకొన్నట్టు అనిపించింది- వాళ్ళ పోకడ చూస్తే.

ఆమె అతని చేతిని వేలాడుతోందా అన్నట్టుంది. సగం రొమ్ము అతని జబ్బని నొక్కుతోంది. వదులుగా వేసిన జడ పిరుదులు దాటింది. కృతకమైన ఆ నలుపు చెప్పక చెప్తోంది అది సవరం జడ అని! 'అయితేనేం గాక?', అందమైన ఆ విగ్రహానికామాత్రం జడ వుండాలి. అది యివ్వక భగవంతుడామెకి అన్యాయమే చేశాడు' అనుకున్నాడు సుబ్బారావు.

ఆమె చంపకు చారెడేసి కళ్ళు చేసుకుని షో కేసులో నగలు ఆత్రంగా చూస్తూంది. బంగారు మేని ఛాయ నుంచి సన్నని ఇంటిమేట్ సువాసన ఆమె నడుస్తున్న తావెల్లా పరచుకుంటూంది. 'బంగారుకి తావి అబ్బటం అంటే ఇలాగే వుంటుంది కాబోలు' అనుకుంటూ ముఖంలో చిరునవ్వుతో ఆహ్వానించాడు సుబ్బారావు.

"ఉంగరాలు చూపెట్టండి" అంటూ ఆమె చేయి అందుకుని వేళ్ళు చూపాడు-యీ సైజువి అన్నట్టు. ఆచేష్టలో ఎంతశృంగారం. ఆమె మరింత దగ్గిరగా జరిగిందతగానికి. 'లేటు వయసులో ప్రేమ యిలా కాస్త ఘాటుగానే వుంటుంది కాబోలు' అనుకున్నాడు సుబ్బారావు. ఒక సైడు కేసు తెరచి ఒక ఉంగరాల ట్రే బయటపెట్టాడు. మెదడు ఆ ట్రేలో వున్న ఉంగరాలు ఒకటికి పదిసార్లు లెక్కలు వేసుకుంటూనే వుంది. నోరు సేల్సుటాకులో పడిపోయింది.

"ఓ! ఇది చూడండీ! ఎంతో బాగుంది కదూ?" గోముగా అతని భుజంలోకి ముఖం దాచేసుకుంటూ ఓ చూపుడు వేలు ఒక వుంగరం వైపు సారించిందామె. 'అబ్బ! ఏం పోజు' అనుకోబోయి- 'ఛ! కాదు! నటన!' అనుకున్నాడు సుబ్బారావు. ఆ వుంగరం తీసి మహదానందంగా అందించాడు. "కూర్చోండి" అంటూ కుర్చీలు చూపాడు. కనుసన్న చేసి— కూల్ డ్రింకులకి ఆర్డరిచ్చాడు. 'ఈ వగలాడి యీ ముసలాడి చేత యిదే కనుక కొనిపిస్తే - నా పుణ్యం పుచ్చినట్టే- రెండువేల దాకా కమిషన్ వస్తుంది!' అనుకున్నాడు సుబ్బారావు.

'కొంపతీసి ఏ పిల్ల నటీమణి కాదుకద' అనుకోకపోలేదు సుబ్బారావు. ఎందుకో అలాంటివాళ్ళే యిలా వగలు పోగలరని పించింది అతనికి.

"బెల్జియమ్ కట్ సార్. అసలింకిప్పుడు దొరకనే దొరకడం లేదు." షామోయ్ క్లాత్ తీసి ఉంగరాన్నొకసారి అతిమృదువుగా రుద్ది మళ్ళీ అందించాడు. వాలుతున్న ఎండ గాజు తలుపులోంచి పడుతోంది. కాస్త ఎండపడిన ఉంగరం ఒక్కసారి వేల వెల్గు తునకలై ఆ యిద్దరి ముఖాలమీదా నాట్యం చేసింది!

"అబ్బ!" అంటూ ఆ వెల్గులకి కళ్ళు జిగేలుమన్నట్టు ముఖం అతని జబ్బలో దాచేసుకుందామె. చూసీ చూడనట్టు అతగాడి చేయి ఆమె నడుం చుట్టూ అల్లుకుంది.

ఇంతలో డ్రింకులు వచ్చాయి.

అందిస్తూ "తీసుకోండి సార్. ప్లీజ్" అన్నాడు సుబ్బారావు. సుతారంగా అందుకుందామె.

అతగాడు నాలుగు పీల్పులతో సీసా ఖాళీ చేశాడు. ఆమె అరగుక్క తాగి గాజుమీద సీసా పెట్టింది "ఎన్ని కారెట్లు?" అడిగింది.

"ఒక కిలో" అనబుద్ధి అయింది సుబ్బారావుకి—ఆమె అడిగిన తీరు చూసి. లేకపోతే-యివేం రవ్వలనుకుందారాళ్ళనుకుందా?

"ఈ డిజైను చాలా అరుదైనది. బొంబాయి పేటర్న్. చూడండి. దరిదాపు .. "

చేయి చూపి ఆపాడాయన.

"రెండున్నర" బదులు చెప్పాడు సుబ్బారావు.

వేలుకి తగుల్చుకుంది ఆమె. సరిగ్గానే అమరింది కాని కాస్త లూజుగా వుండి బరువుకి డిజైను వేలికి పక్కగా కాస్త వంగిపోతోంది.

ఆమె దాన్ని వేలినుంచితీయడంలేదు – సుబ్బారావుగుండెల్లో రైళ్ళు పరుగులు పెడుతున్నాయి. "ఇంకా ఏమైనా వుంటే చూపెట్టండి" అంటూ కాస్త ముందుకు నడిచాడాయన.

ఆత్రంగా ఉంగరం కోసం చేయిజాపాడు సుబ్బారావు. అతనికేసైనా చూడలేదామె.

"నాకిది నచ్చిందన్నానుకద" అంది. ఆ మాట అనేసరికే కెంపురంగు పెదవులు మూడు సున్నాలుచుట్టి ఆగాయి! "ఇదెంతౌతుంది?" ఆమె చేయి అందుకుని ఉంగరంకేసి పరీక్షగా చూస్తూ అడిగాడాయన.

"ఉంగరం యిస్తే లెక్కకట్టి చెప్తాను సార్." గట్టిగా అడిగితే బేరం పోతుందో, విసిరి కొడుతుందో నన్నంత దడగా అనిపించింది– సుబ్బారావుకి.

ఎంతో బాధపడిపోతున్నట్టు, తీసి యివ్వడానికి చేయి రానట్టు ముఖం పెట్టి ఉంగరం అందించిందామె.

బ్రతుకు జీవుడా అనుకున్నాడు సుబ్బారావు.

'టక్కరి! ఏం హొయలుపోతోంది! ఏ సినిమాల్లోనో — నాటుసారా సీనులో ముంత అందించే వేషానికి - సరిగ్గా సరిపోతుంది!' అనుకున్నాడు.... 'ఒళ్ళే కాని ముఖం జ్ఞాపకం రాని వేషాలకి అద్భుతంగా వుంటుంది' అనుకుంటూ లెక్కలు కట్టడం ప్రారంభించాడు పలకమీద.

పలకమీద లెక్కలు ఎప్పటికప్పుడు తుడిచేయవచ్చు. కాగితంమీగ లెక్కలు వేసి చింపి పారేసినా గొడవే- ఏడిపించే టాక్సు వాళ్ళతో.

ఆమెగారు అయస్కాంతంలా లాగేస్తుంటే అతగాడు అన్ని షో కేసుల్లోకీ గుడ్డిగా తొంగిచూస్తూ ఎప్పటికప్పుడామె చిలుక పలుకులకి తబ్బిబ్బయిపోతూ అందరు సేల్సుమెన్‌కి మహదానందాన్ని కలుగచేస్తున్నారు.

## నేటి కవిత

అద్దంలో– కొండ కాకపోవచ్చును నేటి కవిత
కాని
కొండంత మానవ సర్వాకృతిని
తనలో చూపెట్టగలుగుతున్న
చిన్న అద్దం మాత్రం కాకపోదు నేటికవిత

— సుహాసిని


కొట్లోకి ఒకటీ అరాగా జనం రావడం ప్రారంభం అయింది.... అంతా తిన్నగా బంగారం కేసి సాగిపోతూ ఓసారీ వలపు జంటని ఓరకంట చూసి మరీ పోతున్నారు. సుబ్బారావుకి ఒళ్ళు చచ్చిపోతోంది. కాని- బేరం- లెక్కలు కట్టాడు. అతనికే కళ్ళుకుట్టాయి. 'అబ్బ! యీసారి సుందరికి తప్పకుండా చెవులకి తెల్లరాళ్ళ దుద్దులు కొనిపెడతాను!' అనుకున్నాడు- రాబోయే కమిషనుకి నోరూరిపోతుంటే. అన్నీ చూసి మళ్ళీ వచ్చారు.

పలకమీద లెక్కలు విశదీకరించి తేల్చి చెప్పాడు సుబ్బారావు. పదిహేను వేల రెండొందల ఏభై రూపాయలు.

"రాళ్ళ ఖరీదే విడిగా కొంటే ఎక్కువవుంటుంది సార్. సెంట్ తక్కువ రాళ్లు కనుక యీ ధరకి వస్తుంది" అన్నాడు ఉంగరాన్ని వెల్‌వెట్ ట్రే మీద ఉంచుతూ. దాన్ని అందుకొని వేలుకు తొడుక్కుని మళ్ళీ మురిసిపోతూందామె.




# కాకి గూడు



జీవితం గోడు నిరర్థకమైంది
  ఇది—
ముక్కుతో టకటక పొడుస్తో
లయారంభకాల స్తబ్ధతనించి
వెలికివచ్చే.

ఏ స్పందనల కోయిలల తడి రెక్కల్నో
వెచ్చబరచి:
తన కంపనాల్ని. ఘోషల్ని
తనలోనే పొదువుకొని.
ఆ పిదప తననించి పారిపోయిన
కోయిలలనించి
ఏకాకితనంతో మిగిలే
చింపిరి కాకి గూడు లాంటిది.

—ఎస్.ఎ. రవూఫ్, మెదికో

మృదువుగా ఆమె చేయితట్టి తలూపాడాయన. గుండెల నుంచి భారం తొలగింది సుబ్బారావుకి. తెరిపిగా కూర్చుని ఆయన కోటు జేబులోంచి చెక్కుబుక్కు తీశాడు-పెన్ను కోసం చేయి జాపుతూ. మళ్లీ సుబ్బారావు గుండెల్లో రాయిపడింది. ఈ దుర్మార్గుడు చెక్కిద్దామనుకుంటున్నాడు-కొంపతీసి....భయంతో సుబ్బారావు నుదుట చిరుచెమటలు పోయడం ప్రారంభించాయి.

"సారీ సార్. మేం చెక్కులు తీసుకోము" అన్నాడు. గుండె బాధగా మూల్గుతోంది- యింత కమిషన్ పోతుందను కోలేదు. 'అసలే శుక్రవారం. బ్యాంకు టైమా అయిపోయింది. రేపు ఫోనుచేసి యితగాడికి బ్యాంకు బాలెన్సు ఎంతుందో తెలుసుకునేదాకానైనా వ్యవధివుంటే ఎంత బాగుండును!' అనిపించింది సుబ్బారావుకి.

"ఎలాగా కాస్త వదులుగా వుందికదా. సరిచేయించి సిద్ధంగా వుంచుతాను, సోమవారం వచ్చి తీసుకోండి సార్" అన్నాడు. అతనికీ తెలుసు తనగొంతు పీలగా ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లుగావుందని."అదీ మంచిదే ..." అంటూ ముద్దుగా ఆమె చేయి అందుకున్నాడాయన..... ఉంగరం తీయడానికి. ఆయన ఎందుకో ఉత్సాహంగా వున్నాడు. వింత హొయలు పోయిన ఆ మత్తుకళ్ళు యిప్పుడు కోపంగా- కసిగా సుబ్బారావు కేసి చూస్తూ- ఉంగరం విసురుగా ట్రేలో పడేసిందామెగారు. సుబ్బారావు పోతుందనుకున్న ప్రాణం లేచివచ్చింది. అతడామెని నడుముమీద చేయివేసి నడిపించుకుపోయాడు గాజు తలుపులకేసి. ఆమె అతని చేతికి వేలాడకపోయినా బుంగమూతి పెట్టుకునే వుండడం సుబ్బారావు గమనించకపోలేదు.

సేఠ్‌జీ కేకవేయడంతో యీ లోకంలోకి వచ్చిపడ్డ సుబ్బారావు ఉంగరం లోపలపెట్టి తాళంవేసి సేఠ్‌జీసీటు దగ్గిర కొచ్చి- అడక్కుండానేవివరించడం ప్రారంభించాడు.

"మనూరు బ్యాంకు కూడా కాదు సార్. కనుక్కుందుకు. అంచేత...." నసిగాడు సుబ్బారావు.

"ఫరవాలేదులే. సోమవారం వస్తానన్నాడుగా" అని మాటకి వూరుకున్నాడు సుబ్బారావు. ఎందుకో అతను రాడేమో అనిపించింది సుబ్బారావుకి.

సాయంత్రం కొట్టు కట్టేశాక రెండు మూరల మల్లెపువ్వులు కొనుక్కుని ఇంటి ముఖం పట్టిన సుబ్బారావు మనస్సు ఇంకా పోయిన కమిషన్ గురించి మూల్గుతూనే వుంది.

"పోనీలెస్తురూ రాబోయే డబ్బుకిప్పుడే బేరమెందుకు?" అని వూరుకుంది సుందరి. ఆమెకిదేం అంత ముఖ్యమైన సంగతిగా తోచడం లేదు.... ఆమె మనసు ఖర్చునీ. రాబడినీ- మనస్సులోనే మళ్ళీ ఎడ్జెస్టుమెంట్లు చేస్తూంది కాబోలు! మధ్యతరగతి మహిళ కదా- నిరుత్సాహం కృంగదీయకుండా- ఏదో ఒకటి చేస్తూండక తప్పదు.

సోమవారం ఉదయం రానే వచ్చింది. కొట్టు తెరవగానే మొదటి కస్టమరు ఆయనే కావడంతో మూర్ఛపోయినంత పని చేశాడు సుబ్బారావు.

"సారీ. నాకా ఉంగరం కాదుగాని రవ్వల కమ్మలు అదే ధరకి చూడండి" అంటూ కూర్చున్నాడు. హుషారుగా వున్నాడు కూడా.

"మరి ఆమె?" అడక్కూడని విషయమే. కాని సుబ్బారావు నోరు జారకుండా ఉండలేకపోయాడు.

కాస్త గట్టిగానే నవ్వేస్తూ "పీ ధర్మమా అంటూ ఇక్కడ రెండు రోజులూ స్వర్గంలోలా వున్నానయ్యా!స్వర్గంలో ఉన్నాను! వచ్చే నెల మా అమ్మాయి పెళ్ళి వస్తుంది. నగలకి మళ్ళీ వస్తాములే...." అన్నాడు మాట మార్చి. సుబ్బారావు పలక మీద లెక్కలు వేశాడు. పధ్నాలుగు వేల చిల్లర. నోట్లు లెక్కపెట్టి యిచ్చాడాయన. "బిల్లు ... ఒక్కక్షణం...." అన్నాడు దుద్దులు ఓసారి పోలిష్ చేసి పెట్టెలో పెట్టూ.

"అక్కర లేదయ్యా- మీరేం కావలిస్తే అలా రాసుకోండి" అంటూ పెట్టెను లోపలి జేబులో పెట్టుకుంటూ లేచాడాయన. సుబ్బారావు కింకా- తానేదైనా అమ్మానా? లేదా? అన్న సందిగ్ధం వదలడం లేదు.

"సారీ! యంగ్ మాన్. ముచ్చి బంగారానికి-నేను విలువ యివ్వను!" అంటూ చాలా హుషారుగా గాజుతలుపు తీసి బయటికి నడిచాడు.

'మరి భార్య? మేలిమి కాబోలు!' సణుక్కుంటూరొక్కం సేఠ్‌కి అప్పగించాడు సుబ్బారావు.

సేఠ్ నవ్వుతూ కమిషన్ అప్పటికప్పుడే యిచ్చేశాడు. క్యాష్ బేరం చేశాడు కద.

ఈవింత రాత్రి సుందరికి చెప్తే ఆమెనవ్వేస్తూ "మగాళ్లింతే నండీ. వుంచుకుంటారేగాని ఆ ఆడదానికి విలువ యివ్వలేరు చూసి చూసి" అంది.

సుబ్బారావుకి నిర్వచనం అర్థం కాలేదుగాని భార్యని దగ్గిరగా తీసుకుంటూ,"ఈసారి నీకు దుద్దులు తప్పకుండా చేయించేస్తాను!" అన్నాడు ఏవో యిమిటేషన్ దుద్దులున్న సుందరి చెవిలో.

*